సాక్షి నిర్మల్
గురువారం । 28 । సెప్టెంబర్ । 2023



అప్రమత్తతే శ్రీరామరక్ష

జిల్లాలో వరి పంటలో చీడపీడల నివారణకు రైతులు పురుగు మందులను పిచికారీ చేస్తున్నారు. ఈ క్రమంలో కొందరు కూలీలు, రైతులు కనీస జాగ్రత్తలను తీసుకోవడం లేదు. 8లో▸

పోరాటాలతోనే కుల నిర్మూలన

కుంటాల: పోరాటాలతోనే కుల నిర్మూలన వ్యవస్థ సాధ్యమవుతుందని సీపీఐ(ఎల్) ప్రజాపంథా జిల్లా అధ్యక్షుడు ఎం.బక్కన్న పేర్కొన్నారు. బుధవారం కల్లూర్‌లో ఏర్పాటు చేసిన కుల నిర్మూలన ప్రచార సభలో మాట్లాడారు. 150 ఏళ్ల కిందట కుల నిర్మూలన వ్యవస్థ కోసం జ్యోతిబాపూలే సత్యశోధక్ సమాజ్ ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు రాం లక్ష్మణ్, ఐఎఫ్‌టీయూ జిల్లా కోశాధికారి ఎండీ గఫూర్, రవి,కృపాకర్, తదితరులు పాల్గొన్నారు.

గరిష్టం/కనిష్టం
31.0 /24.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు సాధారణంగా నమోదవుతాయి. జిల్లాలో అక్కడక్కడా చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

నేడు జిల్లాలో కేంద్ర మంత్రి పర్యటన

నిర్మల్‌చైన్‌గేట్: కేంద్ర మంత్రి పురుషోత్తం రూపాల గురువారం జిల్లాలో పర్యటించనున్నట్లు బీజేపీ ఆదిలాబాద్ పార్లమెంట్ కన్వీనర్ అయ్యన్న గారి భూమయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని మహేశ్వర్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో గురువారం ఉదయం 8 గంటలకు నిర్మల్, 9 గంటలకు ముధోల్, 10 గంటలకు ఖానాపూర్, 11 గంటలకు బోథ్, 12 గంటలకు ఆదిలాబాద్ నియోజకవర్గాల పార్టీ కార్యకర్తలతో నిర్వహించనున్న అసెంబ్లీ కోర్ కమిటీ సమావేశంలో పాల్గొననున్నట్లు ఆయన పేర్కొన్నారు. సమావేశానికి జోనల్ ఇన్‌చార్జి శ్రీమతి జయశ్రీ, పార్లమెంటు ప్రభావరి అల్జాపూర్ శ్రీనివాస్ రానున్నట్లు తెలిపారు. అన్ని నియోజకవర్గాల అసెంబ్లీ కోర్ కమిటీ సభ్యులు సకాలంలో హాజరుకావాలని ఆయన కోరారు.

మంత్రి ఐకేరెడ్డితో జాన్సన్ నాయక్ భేటీ

నిర్మల్‌టౌన్: ఖానాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి జాన్సన్ నాయక్ బుధవారం మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డితో భేటీ అయ్యారు. జిల్లా కేంద్రంలోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో కలిసి నియోజకవర్గ అభివృద్ధి పనులపై చర్చించారు. నిధులు ఆగకుండా చూడాలని మంత్రిని కోరారు. ఖానాపూర్‌లో మళ్లీ బీఆర్ఎస్ జెండా ఎగురవేయడానికి కార్యకర్తలతో మమేకమై ముందుకు సాగాలని మంత్రి సూచించారు.

'బదిలీలు, ప్రమోషన్లు చేపట్టాలి'



మంత్రికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఖానాపూర్: గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల బదిలీలు, ప్రమోషన్లు వెంటనే చేపట్టాలని కోరుతూ ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జాదవ్ వెంకట్రావు బుధవారం విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రికి పలు సమస్యలు విన్నవించారు. ఆయన వెంట సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దూడ రాజనర్సు, తదితరులు ఉన్నారు.

శోభాయాత్ర ప్రశాంతంగా నిర్వహించాలి

• ఎస్పీ ప్రవీణ్ కుమార్



ఎస్పీ ప్రవీణ్ కుమార్

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలో గురువారం గణేశ్ శోభాయాత్ర ప్రశాంతంగా నిర్వహించాలని ఎస్పీ ప్రవీణ్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరిగినా ఉత్సవ కమిటీనే బాధ్యత వహించాలన్నారు. విగ్రహాలను తీసుకెళ్లే వాహనాలపై మద్యం మత్తులో ఉన్నవారిని అనుమతించవద్దన్నారు. రెచ్చగొట్టే నినాదాలు చేయడం, మత స్థలాల సమీపంలో ఊరేగింపులు ఆపడంవంటివి చేయవద్దన్నారు. విద్యుత్ తీగలను గమనిస్తూ శోభాయాత్ర వాహనం నడపాలని సూచించారు. రోడ్లను పూర్తిగా బ్లాక్ చేయవద్దని, వాహనాలకు దారి ఉండేలా ఉత్సవ కమిటీ నిర్వాహకులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నిమజ్జనం రూట్లో దాదాపు 100 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని, వాటిని పూర్తిగా పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానం చేశామన్నారు. వెయ్యి మంది సిబ్బందితో ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

'ప్రభుత్వ వైఫల్యంతోనే గ్రూప్–1 పరీక్ష రద్దు'



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

ఖానాపూర్: సీఎం కేసీఆర్ ప్రభుత్వ పాలనా వైఫల్యంతోనే గ్రూప్–1 పరీక్ష రద్దయిందని లంబాడా హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు గోవింద్‌నాయక్, అంబేద్కర్ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రాచమల్ల అశోక్ ఆరోపించారు. బుధవారం పట్టణంలో నిరుద్యోగ యువకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. గతంలో నిర్వహించిన గ్రూప్–1 పరీక్ష పేపర్ లీకేజీ కారణంగా రద్దయిందని, దీనికి బాధ్యత వహించాల్సిన బోర్డు సభ్యులపై ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. పేపర్ లీకేజీపై విచారణ సాగుతుండగానే ప్రభుత్వం జూన్ 11న తిరిగి పరీక్ష నిర్వహించిందన్నారు. పరీక్ష రాసిన అభ్యర్థులకు ప్రభుత్వం లక్ష రూపాయల పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. సుభాష్, కిరణ్, రాజేశ్, సాయికిరణ్, రమేశ్, శశిధర్, తదితరులు పాల్గొన్నారు.

వీడ్కోలుకు వేళాయె..



వినాయకసాగర్ వద్ద ఏర్పాటు చేసిన క్రేన్



నిమజ్జన శోభాయాత్ర ఏర్పాట్లు పరిశీలిస్తున్న కలెక్టర్ వరుణ్‌రెడ్డి, ఎస్పీ ప్రవీణ్‌కుమార్

- నేడు నిర్మల్‌లో గణేశ్ నిమజ్జనోత్సవం
- ఘనంగా ఏర్పాట్లు చేసిన ఉత్సవసమితి
- ప్రారంభించనున్న మంత్రి 'అల్లోల'
- పోలీసు శాఖ భారీ బందోబస్తు
- ప్రశాంతంగా ముగిసేలా సహకరించాలని..
- జాగ్రత్తగా ఉండాలని సూచిస్తున్న అధికారులు

నిర్మల్‌చైన్‌గేట్: కైలాసం వీడి చవితి రోజు భూలోకం విచ్చేసిన వినాయకుడు.. ఘనంగా ఏర్పాట్లు చేసిన మండపాల్లో కొలువుదీరాడు. పదకొండు రోజుల పాటు తీరొక్క పూజలందుకుంటూ భక్తుల మొర ఆలకించాడు. ఇక అంతా బాగుంటుందంటూ అభయహస్తంతో దీవించాడు. నిత్యపూజలు, అన్నదానాలు, ఆటలపోటీలు, రోజంతా భక్తిపాటలు, పిల్లల సందడితో వాడవాడలా అలరించిన వినాయకుడికి వీడ్కోలు పలికే వేళయింది. జిల్లా కేంద్రంలో కొలువుదీరిన గౌరీతనయుడు గురువారం గంగమ్మ ఒడికి చేరేందుకు సిద్ధమయ్యాడు. మేళతాళాలు, డీజేపాటలు, తీన్మార్ నృత్యాలతో సాగనంపేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. నిమజ్జనోత్సవాన్ని ప్రశాంతంగా పూర్తి చేసేందుకు పోలీసుశాఖ భారీ బందోబస్తు చేపడుతోంది.

పూజలు చేసి, స్వాగతం పలికి..

నిర్మల్ గణేశ్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో స్థానిక బుధవార్‌పేట్ ఒకటో నంబర్ గణపతి వద్ద మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, జిల్లా అధికారులు, పురపెద్దల సమక్షంలో పూజలు చేసి నిమజ్జనోత్సవాన్ని ప్రారంభిస్తారు. అక్కడి నుంచి శోభాయాత్ర ప్రారంభమవుతుంది. అనంతరం స్థానిక నగరేశ్వరవాడ చౌరస్తాలో ఉత్సవ సమితి ఏర్పాటు చేసిన వేదిక నుంచి గణనాథులకు స్వాగతం పలుకనున్నారు.

శోభాయాత్ర ఇలా..

జిల్లాలోనే కాకుండా ఉత్తర తెలంగాణలోనే నిర్మల్ నిమజ్జనోత్సవం ప్రత్యేకంగా నిలుస్తుంది. ఇక్కడ పెద్ద(గల్లీ)గణపతులకు నంబర్లు ఉంటాయి. ఒకటి నుంచి యాభైకి పైగా నంబర్లు కేటాయించిన గణనాథులు ఉన్నాయి. ఇవన్నీ కూడా తమకు కేటాయించిన నంబర్ల వారీగానే శోభాయాత్రలో ముందుకు సాగుతాయి. ముందుగా బుధవార్‌పేట్‌లో ఒకటోనంబర్ గణపతి నుంచి శోభాయాత్ర ప్రారంభమవుతుంది.

వినాయక్‌సాగర్‌లో..

వినాయక విగ్రహాల నిమజ్జనం కోసం మున్సిపల్, పంచాయతీరాజ్, రెవెన్యూ, విద్యుత్, ఫైర్, పోలీస్ అధికారుల పర్యవేక్షణలో బంగల్‌పేట్‌లోని వినాయక్‌సాగర్ (బంగల్‌చెరువు)లో ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇప్పటికే ఐదు, ఏడు, తొమ్మిది రోజుల పాటు నవరాత్రులు నిర్వహించిన గణనాథులను ప్రశాంతంగా నిమజ్జనం చేశారు. ఇక గురువారం భారీ విగ్రహాల నిమజ్జనానికి తగ్గట్లు చెరువు వద్ద క్రేన్ సిద్ధంగా ఉంచారు. మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఆరు చౌరస్తాల్లో జనరేటర్లు, 400 వరకు అదనంగా వీధిదీపాలు ఏర్పాటు చేశారు. చెరువు వద్ద 20 మంది గజఈతగాళ్లను అందుబాటులో ఉంచారు.

భారీ భద్రత..

గతంలో జరిగిన ఘటనల నేపథ్యంలో నిమజ్జనోత్సవానికి పోలీస్ శాఖ భారీ బందోబస్తు ఏర్పాటు చేసింది. ఎస్పీ ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో ముగ్గురు అడిషనల్ ఎస్పీలు, నలుగురు డీఎస్పీలు, పదిమంది సీఐలు, 45 మంది ఎస్సైలు, దాదాపు 450 మంది పోలీసు సిబ్బంది నిమజ్జన విధుల్లో పాల్గొంటున్నారు. 300 సీసీ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేశారు.

నిమజ్జనోత్సవ శోభాయాత్ర ఇలా..

బుధవార్‌పేట్–పాతబస్టాండ్–వివేక్‌చౌక్–జయశంకర్‌చౌరస్తా–నగరేశ్వరవాడ–సునార్‌గల్లీ–ద్యాగవాడ–పెద్దమార్కెట్–దేవరకోట–టౌన్‌పోలీస్‌స్టేషన్–సోమవార్‌పేట్–గాంధీ చౌక్–జుమ్మెరాత్‌పేట్–నాయుడివాడ–బేస్త వార్‌పేట్–బంగల్‌పేట్‌ల మీదుగా వినాయక్ సాగర్(బంగల్‌చెరువు) వరకు సాగుతుంది.

నిమజ్జనానికి నిఘా..

గణనాథుల ఊరేగింపు పగటి వేళలో నిర్వహించాలి. నిమజ్జనోత్సవానికి పోలీసు సిబ్బందితో పాటు సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాం. అసత్య ప్రచారాలు, పుకార్లు నమ్మవద్దు. అనుమానిత వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారమివ్వాలి. – ఏ.గంగారెడ్డి, డీఎస్పీ, నిర్మల్

ఏర్పాట్లు పూర్తి చేశాం

వినాయక సాగర్ చెరువు వద్ద భక్తుల కోసం అన్నిఏర్పాట్లు పూర్తిచేశాం. 20 మంది గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచాం. పట్టణంలోని ఆయా చౌరస్తాల జనరేటర్లు ఏర్పాటు చేసి అదనంగా వీధిదీపాలు పెట్టాం.

– సీవీఎస్ రాజు, మున్సిపల్ కమిషనర్

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- నిమజ్జనానికి విగ్రహాలను తీసుకెళ్లే ట్రాక్టర్లు కండిషన్ ఉన్నవి మాత్రమే ఉపయోగించాలి.
- శోభాయాత్రకు వినియోగించే ఆటోలు, ట్రాక్టర్లు, ఇతర వాహనాల టైర్లు, బ్రేకులు ముందుగానే ఒకటికి రెండుసార్లు పరీక్షించుకోవాలి.
- అనుభవం, లైసెన్స్ ఉన్న డ్రైవర్లు మాత్రమే వాహనాలు నడిపేలా చూడాలి.
- చీకటి పడే సమయానికి నిమజ్జనం జరిగేలా చూడాలి.
- విద్యుత్ వెలుగుల మధ్యనే నిమజ్జనం చేసేలా చూడాలి.
- ఈత వచ్చిన వారు మాత్రమే విగ్రహాలను నీటిలోకి తీసుకెళ్లి నిమజ్జనం చేయాలి.
- ఎత్తయిన విగ్రహాలను తీసుకెళ్లేప్పుడు కరెంటు వైర్లు, ట్రాన్స్‌ఫార్మర్లు గమనించాలి. విద్యుత్ ప్రమాదాలు జరగకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలి.
- పరిమితికి, నిబంధనలకు మించి డీజే శబ్దాన్ని ఉపయోగించవద్దు.

బడుగుల స్ఫూర్తి ప్రదాత కొండా లక్ష్మణ్

• కలెక్టర్ వరుణ్‌రెడ్డి



నివాళులర్పిస్తున్న కలెక్టర్

నిర్మల్‌చైన్‌గేట్: తెలంగాణ స్వాతంత్ర్య సమరయోధుడు, బడుగు, బలహీన వర్గాల స్ఫూర్తిప్రదాత కొండా లక్ష్మణ్ బాపూజీ సేవలు చిరస్మరణీయమని కలెక్టర్ వరుణ్‌రెడ్డి అన్నారు. వెనుకబడిన తరగతుల అభివృద్ధిశాఖ ఆధ్వర్యంలో బుధవారం సమీకృత కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ 108 వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి కలెక్టర్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రత్యేక రాష్ట్రం కోసం అహర్నిశలు శ్రమించారన్నారు. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి మండలంలో జన్మించిన ఆయన చిన్నతనం నుండే ఉద్యమ బాట పట్టారన్నారు. మంత్రి పదవిని తృణప్రాయంగా వదులుకున్న మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. యువత ఆయన ఆశయాలను కొనసాగించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ రాజేశ్వర్‌గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ చిలక రమణ, పద్మశాలి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అశోక్, బీసీ సంక్షేమ సంఘం నాయకులు బిట్లింగ్ నవీన్,కృష్ణంరాజు, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాలు పరిశుభ్రంగా ఉండాలి

లక్ష్మణచాంద: గ్రామాలు పరిశుభ్రంగా ఉండాలని అడిషనల్ కలెక్టర్ కిశోర్ కుమార్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని రాచాపూర్, బోరిగాం గ్రామాలను సందర్శించారు. జూనియర్ పంచాయతీ కార్యదర్శుల పనితీరు ఆధారంగా వారిని క్రమబద్ధీకరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా రాచాపూర్, బోరిగాం గ్రామాల్లో పర్యటించారు. మురుగు నీటి కాలువలు, సెగ్రిగేషన్ షెడ్డు, రోడ్లు పరిశీలించారు. స్వచ్ఛత హి కార్యక్రమంలో భాగంగా రాచాపూర్ గ్రామ పంచాయతీ ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంపీడీవో శేఖర్, ఎంపీవో నసీరుద్దీన్, సర్పంచ్ బొర్రవ్వ, ఉప సర్పంచ్ ముత్యం, గంగారాం, ఎఫ్ఏ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యానికి 'ఆయుష్మాన్ భవ'

- అక్టోబర్ 2వ తేదీ వరకు ప్రత్యేక కార్యక్రమం
- ఆరోగ్య మేళాలు, యోగా, రక్తదాన శిబిరాల నిర్వహణ
- ఉచితంగా అన్నిరకాల వైద్య పరీక్షలు, మందుల పంపిణీ

నిర్మల్‌చైన్‌గేట్:ప్రజల చెంతకే వైద్యం తీసుకెళ్లేలా కేంద్ర ప్రభుత్వం 'ఆయుష్మాన్ భవ' పేరుతో సరికొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఈ కార్యక్రమాన్ని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఢిల్లీలో ప్రారంభించారు. ఇందులో భాగంగా దేశవ్యాప్తంగా ఈనెల 17 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టనున్నారు. సీహెచ్‌సీలు, పీహెచ్‌సీలు, యూహెచ్‌సీలు, వెల్‌నెస్ కేంద్రాల పరిధిలో ఆయుష్మాన్ భవ కార్యకలాపాలు నిర్వహించేందుకు వైద్య ఆరోగ్య శాఖ అధికారులు ఏర్పాట్లు చేశారు.

ఇంటింటికీ కార్డులు..

ప్రధానమంత్రి జన ఆరోగ్య యోజన ద్వారా గ్రామాల్లో వైద్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి వారి వివరాలు సేకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేసి కుటుంబ సభ్యులకు ఆయుష్మాన్ భారత్ హెల్త్ అకౌంట్ కార్డులు అందిస్తున్నారు. ఈ కార్డు ఉంటే దేశవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యం పొందవచ్చు. ఎలాంటి పత్రాలు అవసరం లేదు.

ప్రతీపల్లెలో సభ..

ఆయుష్మాన్ భవ కార్యక్రమంలో భాగంగా ప్రతీ గ్రామంలో సభ నిర్వహిస్తారు. వైద్యారోగ్య శాఖ ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న ఆయుష్మాన్ భారత్, ఆరోగ్యశ్రీ తదితర పథకాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉన్న సౌకర్యాలు, అందిస్తున్న వైద్యసేవలను తెలియజేస్తారు.

అన్ని రకాల వైద్య పరీక్షలు..

ఆయుష్మా భవ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసే శిబిరాల్లో బీపీ, మధుమేహం, ఓరల్, బ్రెస్ట్, సర్వైకల్ క్యాన్సర్లకు సంబంధించిన స్క్రీనింగ్ టెస్ట్‌లు చేస్తారు. టీబీ, లెప్రసీ ఇతర అన్నిరకాల పరీక్షలను నిర్వహిస్తున్నారు. ఈ కేంద్రాలకు వచ్చే వారికి 57 రకాల ఆరోగ్య పరీక్షలను తెలంగాణ డయాగ్నొస్టిక్‌లో నిర్వహించి 24 గంటల్లో రిపోర్ట్ రోగితోపాటు ఆయా కేంద్రాల డాక్టర్లకు అందజేస్తున్నారు. ఆయా పరీక్షల రిపోర్టుల ఆధారంగా వైద్యులు వారికి అవసరమైన వైద్యం అందించి ఉచితంగా మందులు కూడా ఇస్తున్నారు. అవసరమైన వారికి స్పెషలిస్టు వైద్యులతో టెలీకాన్ఫరెన్స్ సేవలు అందిస్తున్నారు. ఆయా కేంద్రాల్లో అందించలేని వైద్య సేవల కోసం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి రెఫర్ చేస్తున్నారు. అక్కడ స్పెషలిస్టు వైద్యులతో వైద్యం అందేలా చూస్తున్నారు.

అక్టోబర్ 2న రక్తదాన శిబిరాలు..

రకరకాల జబ్బులతో బాధపడుతున్న వారు తీసుకోవాల్సిన ఆహారం, జాగ్రత్తలపై ఆరోగ్య శిబిరాల్లో అవగాహన కల్పించనున్నారు. యోగా శిబిరాలు నిర్వహిస్తారు. ప్రస్తుతం వస్తున్న రోగాల నుంచి రక్షణ పొందడానికి అవసరమైన జీవన విధానాన్ని వివరించనున్నారు. అక్టోబర్ 2న జిల్లా కేంద్రంతోపాటు, ప్రధాన పట్టణాల్లో రక్తదాన శిబిరాలు నిర్వహిస్తారు. విద్యార్థులు, యువజన సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, సామాజిక సేవా సంఘాలను భాగస్వాములను చేసి రక్తం సేకరించనున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి



ఈనెల 17 నుంచి కేంద్ర ప్రభుత్వ ఆయుష్మాన్ భవ కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న మెగా హెల్త్ మేళాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి. వివిధ రకాల వైద్య పరీక్షలను ఉచితంగా నిర్వహిస్తున్నాం. అన్ని రకాల జబ్బులకు ఉచితంగా మందులు అందిస్తున్నాం. రక్తదాన శిబిరాల్లో యువత, విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థలు భాగస్వాములు కావాలి.

– డాక్టర్ ధనరాజ్, డీఎంహెచ్‌వో

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

• మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి



చెత్త సేకరణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి

నిర్మల్‌టౌన్: మన ఇంటిచుట్టూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, లేదంటే రోగాల బారిన పడతామని మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని నాగనాయిపేట్‌లో రూ.60 లక్షలతో ఏర్పాటు చేసిన పొడి చెత్త సేకరణ కేంద్రాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తడి, పొడి చెత్త కలిపితే జరిగే అనర్థాలపై అందరికీ అవగాహన ఉండాలన్నారు. అందుకే పట్టణంలో పొడి చెత్తను వేరు చేసే మిషనరీని ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ వరుణ్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్, ఎంపీపీ రామేశ్వర్‌రెడ్డి, అధికారులు, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

పట్టణంలో 'స్వచ్ఛతా హీ సేవ'

పట్టణంలోని బంగల్‌పేట్ కాలనీలో మున్సిపల్ సిబ్బంది బుధవారం స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమం నిర్వహించారు. చెత్తను విచ్చలవిడిగా రోడ్లమీద వేయడం వల్ల జరిగే అనర్థాల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు.

వినాయక సాగర్‌ను పరిశీలించిన మంత్రి

జిల్లా కేంద్రంలో ఈ నెల 28 నిర్వహించనున్న గణేశ్ నిమజ్జనోత్సవంలో భాగంగా బుధవారం మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి వినాయక సాగర్ చెరువును పరిశీలించారు. ఏర్పాట్లపై మున్సిపల్ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. నిమజ్జనానికి వచ్చే ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్నిరకాల చర్యలు చేపట్టాలని సూచించారు.

గ్రామాలతోనే రాష్ట్ర అభివృద్ధి

నిర్మల్‌రూరల్: గ్రామాలతోనే రాష్ట్రాల అభివృద్ధి జరుగుతుందని మంత్రి ఐకేరెడ్డి అన్నారు. మండలంలోని చిట్యాలలో బుధవారం రూ.10 లక్షలతో నిర్మించనున్న బీసీ కమ్యూనిటీ హాల్ భవనానికి, వేంకటేశ్వరస్వామి ఆలయంలో రూ. 26లక్షలతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చిట్యాల గ్రామాన్ని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. మండలంలోని తాంశ వద్ద రూ.82 లక్షలతో చెక్ డ్యామ్ నిర్మాణానికి అనుమతులు లభించాయన్నారు. కార్యక్రమంలో జెడ్పీచైర్‌పర్సన్ విజయలక్ష్మి, సర్పంచ్ రమేశ్‌రెడ్డి, ఆత్మ చైర్మన్ గంగారెడ్డి, జెడ్పీకోఆప్షన్ మెంబర్ సుభాష్ రావు, ఉపసర్పంచ్ చిన్నయ్య, నాయకులు రామ్ కిషన్‌రెడ్డి, మురళీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

'వనసిరి' పోస్టర్ ఆవిష్కరణ

నిర్మల్‌చైన్‌గేట్: ఆదివాసీ మహిళా సంఘం ఆధ్వర్యంలో వనసిరి పేరిట తయారు చేస్తున్న ఇప్పనూనె ప్రచార పోస్టర్‌ను మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి, కలెక్టర్ వరుణ్‌రెడ్డి, డీఆర్డీవో విజయలక్ష్మి బుధవారం ఆవిష్కరించారు. కడెం మండల కేంద్రంలోని మహిళా సంఘం ఆధ్వర్యంలో ఔషధ గుణాలు కలిగిన ఈ నూనెను తయారు చేస్తున్నామని డీఆర్డీవో మంత్రికి వివరించారు.

వినాయకులను దర్శించుకున్న మంత్రి

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని దివ్యనగర్, శాస్త్రినగర్ మండపాల్లో ప్రతిష్ఠాపించిన వినాయకులను మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి బుధవారం రాత్రి దర్శించుకున్నారు. నిమజ్జనాన్ని ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని సూచించారు. అనంతరం ఆయా మండపాల నిర్వాహకులు మంత్రిని శాలువాతో సత్కరించారు. మంత్రి వెంట నిర్మల్ మాజీ మున్సిపల్ చైర్మన్ అప్పాల గణేశ్, మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక రమణ ఉన్నారు.

బ్యాంకు లావాదేవీలపై అవగాహన ఉండాలి



చెక్కు అందిస్తున్న శోభ, కలెక్టర్ వరుణ్‌రెడ్డి

నిర్మల్‌టౌన్: బ్యాంకు లావాదేవీలపై ప్రతీఒక్కరికి అవగాహన ఉండాలని తెలంగాణ గ్రామీణ బ్యాంక్ స్టేట్ చైర్మన్ వై.శోభ అన్నారు. జిల్లా కేంద్రంలోని టీజీబీ రీజినల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ డ్వాక్రా మహిళా సంఘాలు తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించి కొత్త రుణాలు పొందాలన్నారు. ఇప్పటి వరకు రూ.27 వేల కోట్ల టర్నోవర్ జరిగిందన్నారు. జీవిత బీమాపై ప్రతీఒక్కరికి అవగాహన ఉండాలన్నారు. 'బీమా–ధీమా' పేరుతో త్వరలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అంతకు ముందు స్థానిక అంబేద్కర్ భవన్‌లో కలెక్టర్ వరుణ్‌రెడ్డి చేతుల మీదుగా రూ.50 కోట్ల చెక్కును రీజినల్ కార్యాలయానికి సంబంధించిన 51 బ్రాంచ్‌లకు అందజేశారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు రీజినల్ మేనేజర్ రామారావు, డీఆర్డీవో విజయలక్ష్మి, స్థానిక బ్రాంచ్ మేనేజర్ శ్రీకాంత్, ఎస్ఎండీ శివకుమార్, ఎస్ఎంవో అభినయ్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉపకరణాల అర్హుల జాబితా విడుదల

నిర్మల్‌చైన్‌గేట్: మహిళా, శిశు, వయోవృద్ధులు, దివ్యాంగులు, ట్రాన్స్‌జెండర్ల సంక్షేమ శాఖ, తెలంగాణ దివ్యాంగుల సహకార సంస్థ ద్వారా 2022–23 ఆర్థిక సంవత్సరానికి ఉపకరణాల కోసం దరఖాస్తు చేసుకున్న దివ్యాంగుల అర్హుల జాబితాను కార్యాలయ నోటీస్ బోర్డుపై ఉంచినట్లు జిల్లా సంక్షేమాధికారి రమేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. దివ్యాంగులకు సంబంధించిన రెట్రో ఫిట్టెడ్ మోటార్ వెహికల్ (8), బ్యాటరీ వీల్‌చైర్ (6), ల్యాప్‌టాప్ (3), 4జి స్మార్ట్ ఫోన్లు (7) కోసం దరఖాస్తు చేసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. జాబితాపై అభ్యంతరాలుంటే అక్టోబర్ 1లోగా తెలియజేయాలన్నారు.

ఊడిన రోప్ వీల్స్... విరిగిన కౌంటర్ వెయిట్

• మరమ్మతు చేస్తున్న సిబ్బంది




మరమ్మతు చేస్తున్న సిబ్బంది

కడెం(ఖానాపూర్): కడెం ప్రాజెక్ట్ 15వ నంబర్ వరదగేటు ఒక వైపు ఉన్న కింది, పైభాగంలోని రెండు రోప్‌వీల్స్ ఊడిపోవడం వల్లే కౌంటర్ వెయిట్ ఒక వైపునకు వంగడంతో విరిగిపోయిందని మెకానికల్ డీఈ కరుణాకర్, ఏఈ సంగీత్ తెలిపారు. బుధవారం కడెంకు వచ్చిన ఎక్స్‌పర్ట్ మెకానికల్ టీం వరద గేటును చైన్ పుల్లింగ్ ద్వారా కిందకు దించేందుకు మరమ్మతులు ప్రారంభించినట్లు వారు పేర్కొన్నారు. రెండు రోజుల్లో గేటును కిందకు దించనున్నట్లు తెలిపారు. మరమ్మతు పనులను ఎస్ఈ సుశీల్‌కుమార్, ఈఈ విఠల్ పరిశీలించారు. బుధవారం రాత్రి ప్రాజెక్ట్‌కు 3,545 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రావడంతో మూడు వరద గేట్ల ద్వారా 19,419 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 700 అడుగులు కాగా ప్రస్తుతం 698.075 అడుగుల నీటిమట్టం ఉంది.

గృహలక్ష్మి నిరుపేదలకు వరం

నిర్మల్‌చైన్‌గేట్: గృహలక్ష్మి పథకం నిరుపేదలకు వరమని మంత్రి ఐకేరెడ్డి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో కలెక్టర్ వరుణ్‌రెడ్డితో కలిసి గృహలక్ష్మి లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 2,487 మంది ఎంపికైనట్లు తెలిపారు. తొలివిడత 6 గ్రామాల పరిధిలో 123 మందికి పత్రాలు అందించామన్నారు. భాగ్యనగర్‌లో 21, డ్యాంగ్‌పూర్‌లో 7, వెంగ్వపేట్‌లో 32, ఎల్ల పల్లిలో 20, తల్వేదలో 17, ఖానాపూర్ 26 మందికి మంజూరు పత్రాలు అందజేశారు.

నేటి నుంచి జోనల్ స్థాయి క్రీడా పోటీలు



ఏర్పాట్లు పరిశీలిస్తున్న డీటీడీవో అంబాజీ

నిర్మల్‌చైన్‌గేట్: ఈ నెల 28 నుంచి జోనల్ స్థాయి క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు డీటీడీవో అంబాజీ, జిల్లా క్రీడల అధికారి భుక్య రమేశ్ తెలిపారు. బుధవారం జిల్లా కేంద్రంలోని డిగ్రీ కళాశాలలో క్రీడా పోటీలకు సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో ఉదయం 10 గంటలకు జరుగనున్న క్రీడలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. కలెక్టర్ వరుణ్‌రెడ్డి, ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్ హాజరుకానున్నట్లు తెలిపారు. ఏసీఎంవో శివాజీ, వ్యాయామ ఉపాధ్యాయులు రాంజీ ఉన్నారు.

క్లుప్తంగా

దీక్ష శిబిరంలో పడిపోయిన ఆశ వర్కర్


రాజమణికి నీళ్లు తాగిస్తున్న కార్యకర్తలు

కడెం: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట దీక్ష శిబిరంలో దీక్ష చేపట్టిన మండలంలోని సారంగాపూర్ ఆశా వర్కర్ రాజమణి హైబీపీతో కిందపడింది. గమనించిన తోటి ఆశ వర్కర్లు సమీపంలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి ఖానాపూర్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఇకనైనా ఆశ వర్కర్లకు న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చాలని కోరుతున్నారు.

స్వర్ణ ప్రాజెక్టు గేటు ఎత్తివేత


గేటు ఎత్తి నీటిని విడుదల చేస్తున్న దృశ్యం

సారంగపూర్: ఎగువ ప్రాంతమైన మహారాష్ట్రలో బుధవారం తెల్లవారుజామున కురిసిన భారీ వర్షానికి ప్రాజెక్టులోకి భారీగా వరదనీరు వచ్చి చేరడంతో అప్రమత్తమైన అధికారులు ప్రాజెక్టు ఒక గేటు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేశారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1183 అడుగులు(1.484 టీఎంసీ) కాగా ప్రాజెక్టులోకి వెయ్యి క్యూసెక్కుల వరదనీరు వచ్చి చేరడంతో ఒక గేటు ద్వారా అంతే మొత్తం నీటిని స్వర్ణ నదిలోకి విడుదల చేశారు. ప్రస్తుతం ప్రాజెక్టు నీటిమట్టం 1183 అడుగుల వద్ద స్థిరంగా ఉంచామని జేఈ మధుపాల్ తెలిపారు.

కడెం హరితకు బెస్ట్ రిసార్ట్స్ అవార్డు


మేనేజర్‌కు అవార్డు అందిస్తున్న మంత్రి

కడెం: మండల కేంద్రంలోని హరిత రిసార్ట్స్ బెస్ట్ టూరిజం రిసార్ట్ అవార్డ్‌కు ఎంపికైంది. పర్యాటక దినోత్సవ వేడుకల్లో భాగంగా బుధవారం హైదరాబాద్ శిల్పారామంలో నిర్వహించిన కార్యక్రమంలో పర్యాటకశాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, పర్యాటకశాఖ చైర్మన్ గెల్లు శ్రీనివాస్, ఎండీ మనోహర్‌రావు చేతుల మీదుగా కడెం హరితరిసార్ట్స్ మేనేజర్ ఎస్.తిరుపతి అవార్డును అందుకున్నాడు. సందర్శకులకు చక్కని అతిథ్యమిస్తున్న కడెం రిసార్ట్స్ మూడో అవార్డును అందుకుంది.

రెజ్లింగ్‌లో ముధోల్ విద్యార్థికి బంగారు పతకం


గోల్డ్‌మెడల్‌తో విద్యార్థి

ముధోల్: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రెండవ సంవత్సరం చదువుతున్న విద్యార్థి ఎం.ఆకాష్ రెజ్లింగ్ పోటీల్లో బంగారు పతకాన్ని సాధించినట్లు ప్రిన్సిపల్ కైసర్‌పాషా తెలిపారు. 61వ తెలంగాణ రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్ రెజ్లింగ్ చాంపియన్‌షిప్ పోటీలు 23వ తేదీన హన్మకొండలో నిర్వహించగా ఆకాష్ బంగారు పతకాన్ని సాధించి జాతీయ స్థాయికి ఎంపికై నట్లు తెలిపాడు. మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి చేతుల మీదుగా అవార్డు అందుకున్నాడు. అక్టోబర్ 4వ తేదీన మధ్య ప్రదేశ్‌లో జరిగే జాతీయ స్థాయి రెజ్లింగ్ పోటీలకు ఎంపికై నట్లు తెలిపారు. విద్యార్థిని కళాశాల అధ్యాపకులు శ్రీనివాస్, గంగాధర్, జెడ్పీఎస్ఎస్ స్కూల్ దాగాం పీఈటీ ప్రేమలత అభినందించారు.

అప్రమత్తతే శ్రీరామరక్ష

- పురుగు మందు పిచికారీలో జాగ్రత్తలు తప్పనిసరి
- నిర్లక్ష్యంతో ప్రాణాలు కోల్పోయే ప్రమాదం
- శరీరం నిండా దుస్తులు ధరించాలి
- నోటికి, ముక్కుకు మాస్క్ తప్పనిసరి
- వ్యవసాయాధికారుల సూచనలు


పొలంలో పురుగుల మందులు పిచికారీ చేస్తున్న రైతు

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లాలో వరి పంటలో చీడపీడల నివారణకు రైతులు పురుగు మందులను పిచికారీ చేస్తున్నారు. ఈ క్రమంలో కొందరు కూలీలు, రైతులు కనీస జాగ్రత్తలను తీసుకోవడం లేదు. దీంతో కొన్ని సందర్భాల్లో ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉంది. పురుగు మందుల పిచికారీలో తీసుకోవాలిన్సిన జాగ్రత్తలపై వ్యవసాయాధికారులు రైతులకు పలు సూచనలు చేస్తున్నారు. ఒక్కోసారి ఎంత అప్రమత్తంగా ఉన్నా విషప్రభావానికి గురయ్యే ప్రమాదం ఉందన్నారు. మూడు రకాలుగా పురుగు మందులు శరీరంలోకి ప్రవేశించే అవకాశం ఉందని చెబుతున్నారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు...

- పురుగు మందులు పిచికారీ చేసే సమయంలో విషం చర్మం నుంచి శరీరంలోకి ప్రవేశించే ప్రమాదముంది. శరీరంపై పుండ్లు, గాయాలు ఉంటే మరింత సులభంగా శరీరంలోకి ప్రవేశిస్తుంది. ఆ తర్వాత ఆరోగ్యంపై తీవ్ర దుష్ప్రభావం చూపుతుంది.
- క్రిమిసంహారక మందుల పిచికారీ ద్వారా వెలువడే వాయువులను పీల్చడం ద్వారా విషం శరీరంలోకి ప్రవేశించి హాని కలిగిస్తాయి. తరచూ ఇదే రకంగా పీలుస్తుంటే ముక్కు క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఎక్కువ.
- పురుగు మందులు పిచికారీ చేశాక చేతులు శుభ్రంగా కడుక్కోకుండా ఆహార పదార్థాలు భుజిస్తే నోటి ద్వారా విష పదార్థాలు శరీరంలోకి వెళ్లే ప్రమాదం ఉంది. ఒక్కొక్కప్పుడు మందు ప్రభావం ఎక్కువై మరణం కూడా సంభవిస్తుంది.

ఇలా చేయాలి..

చర్మం ద్వారా విష పదార్థాలు శరీరంలోకి ప్రవేశిస్తే వెంటనే సబ్బు, మంచినీటితో శుభ్రంగా కడగాలి. ఒకవేళ కళ్లలో పడితే మంచినీటితో కడగాలి. చికిత్స కోసం వెంటనే వైద్యుడిని సంప్రదించాలి. ముక్కుతో పీల్చితే విష ప్రభావానికి గురైన వ్యక్తిని గాలి, వెలుతురు బాగా వచ్చే ప్రదేశంలో ఉంచాలి. శ్వాస తీసుకోవడం కష్టంగా ఉంటే వెంటనే కృత్రిమశ్వాస అందించాలి. వీలైనంత త్వరగా వైద్యుడి వద్దకు తీసుకెళ్లి చికిత్స అందించాలి. క్రిమిసంహారక మందు నోటి ద్వారా కడుపులోకి వెళ్తే వాంతి చేయించే మార్గాలు అన్వేషించాలి. గ్లాసు నీళ్లలో ఉప్పు లేదా ఆవాల పొడి కలిపి తాగించాలి.

జాగ్రత్తలు పాటించాలి



క్రిమి సంహారక మందులు పిచికారీ చేసేటప్పుడు శరీరంపై నిండా దుస్తులు ధరించాలి. ముక్కు, నోటికి గుడ్డ మాస్క్ ధరించాలి. లేదా సేఫ్టీ సూట్ ధరించి పిచికారీ చేయాలి. నిర్లక్ష్యంగా వ్యవహరించవద్దు.

– నాగరాజు, ఏవో

అమ్మకానికి అంగన్‌వాడీ గుడ్లు

- దుకాణాదారుడిని నిలదీసిన కాలనీ మహిళలు


దుకాణాదారున్ని నిలదీస్తున్న మహిళ

గుడిహత్నూర్: ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింత, చిన్నారులకు పౌష్టికాహారం అందించే ప్రక్రియలో భాగంగా కోడిగుడ్లను సరఫరా చేస్తోంది. అయితే ఈ కోడి గుడ్లు లబ్ధిదారులకు సక్రమం అందడం లేదనే విమర్శలు తరుచూ వస్తున్నాయి. ఈ క్రమంలో ప్రభుత్వం ఇటీవల అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేసే గుడ్లపై స్టాంపు వేసి సరఫరా చేస్తోంది. దీని ద్వారా బయట మార్కెట్‌లో ఉచిత సరఫరా గుడ్ల విక్రయాలు అరికట్టేందుకు వీలైంది. అయితే మారుమూల ప్రాంతాల్లో ఇంకా పరిస్థితిలో మార్పు కన్పించడం లేదు. మండల కేంద్రంలో వడ్డెర కాలనీలోని ఓ కిరణా దుకాణంలో గుడ్లు కొనుగోలు చేయడానికి వెళ్లిన స్థానిక మహిళకు అంగన్‌వాడీ గుడ్లు ఇవ్వడంతో ఆమె దుకాణదారున్ని నిలదీసింది. ఈ గుడ్లు నీకెవరు ఇచ్చారని ప్రశ్నించింది. దీంతో పలువురు మహిళలు అక్కడికి చేరుకొని కొన్ని రోజులుగా తమకు గుడ్లు అందడం లేదని ఆరోపించారు. కానీ కిరాణా దుకాణంలో అమ్మకానికి ఎలా వచ్చాయని ప్రశ్నించారు. విషయం తెలుసుకున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మ కాలనీకి చేరుకొని దుకాణదారుడిని వాకబు చేసింది. సమ్మెలో ఉన్న అంగన్‌వాడీ, ఆయా కార్యకర్తలు కాకుండా లబ్ధిదారుల్లో ఎవరో అమ్ముకుని ఉంటారని తెలిసిందని, పూర్తి విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని ఆమె తెలిపారు. ఏదేమైన పేదలకు అందాల్సి పౌష్టికాహారం పక్కదారి పట్టడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విజయ స్కూల్ విద్యార్థులు


ఎంపికైన విద్యార్థులతో కరస్పాండెంట్

నిర్మల్‌టౌన్: ఈనెల 25, 26వ తేదీల్లో జరిగిన అథ్లెటిక్స్, నెట్‌బాల్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా కేంద్రంలోని విజయ హైస్కూల్ విద్యార్థులు ఎంపికయ్యారు. అథ్లెటిక్స్ అండర్- 14 బాలికల విభాగంలో 600 మీటర్ల పరుగు పందెంలో కె.లాస్య (9వ తరగతి), అండర్ 16, 100 మీటర్ల పరుగు పందెంలో ఎస్.సంజన (10వ తరగతి), లాంగ్ జంప్ అండర్-16 బాలికల విభాగంలో బి.షారోన్ (10వ తరగతి) జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచారు. నెట్‌బాల్ రాష్ట్ర స్థాయి ఎంపిక పోటీలలో ఇ.ఇష్వంత్ (10వ తరగతి), జి.ఉజ్వల్ వర్ధన్‌రెడ్డి, ఎ.నవనీత్‌రెడ్డి (9వ తరగతి) జోనల్, రాష్ట్ర స్థాయిలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఎంపికైన విజేతలను పాఠశాల కరస్పాండెంట్ మంచిరాల నాగభూషణం, ప్రిన్సిపాల్ సామ మోహన్‌రెడ్డి అభినందించారు.

నిమజ్జన శోభాయాత్రలో అపశ్రుతి


గాయపడ్డ ఓర్సు రాకేశ్


గాయపడ్డ అల్లెపు అరవింద్


గాయపడ్డ సూర రాకేశ్

- ట్రాన్స్‌ఫార్మర్‌కు ఫ్లెక్సీ తగిలి విద్యుత్ ప్రమాదం
- ముగ్గురు బాలురకు తీవ్ర గాయాలు

ఖానాపూర్: నిర్మల్ జిల్లా ఖానాపూర్ పట్టణంలో వినాయక నిమజ్జన శోభాయాత్రలో బుధవారం వేకువ జామున అపశ్రుతి చోటు చేసుకుంది. పట్టణంలోని సుభాష్‌నగర్ కాలనీకి చెందిన యువసేన యూత్ బాలల గణేష్ నిర్వాహకులు ట్రాక్టర్ ట్రాలీలో విగ్రహంతో శోభాయాత్ర చేపట్టారు. తెల్లవారుజామున మండపానికి సమీపంలో గల విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు ట్రాక్టర్‌లోని వినాయకుని విగ్రహం వెనుక ఉన్న ఫ్లెక్సీ తగలడంతో విద్యుత్ ప్రమాదం సంభవించింది. దీంతో అక్కడే ఉన్న అల్లెపు దుర్గ వెంటనే సాహసోపేతంగా ట్రాన్స్‌ఫార్మర్‌కు విద్యుత్ సరఫరా నిలిపివేశాడు. ట్రాక్టర్‌పై ఉన్న అల్లెపు అరవింద్, ఓర్సు రాకేష్, సూర రాకేష్ తీవ్రంగా గాయపడ్డారు. వీరిని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం నిర్మల్‌కు తరలించారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ రోడ్డుకు అడ్డంగా ఉండడంతోనే ప్రమాదం సంభవించిందని, సంబంధిత అధికారులే పూర్తి బాధ్యత వహించాలని బాధిత కుటుంబీకులు డిమాండ్ చేస్తున్నారు. నిర్మల్‌లో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను బీఆర్ఎస్ నాయకుడు జాన్సన్‌నాయక్ పరామర్శించారు.

రోడ్డుపై రాళ్ల కారణంగానే ప్రమాదం

రోడ్డుపై ట్రాక్టర్‌కు అడ్డుగా రాళ్లు ఉండడమే ప్రమాదానికి కారణమని విద్యుత్ శాఖ ఏడీఈ కేశెట్టి శ్రీనివాస్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బండపైకి ట్రాక్టర్ టైర్ వెళ్లడంతో ఒక వైపు వంగి తొమ్మిది ఫీట్ల ఎత్తున్న ఫ్లెక్సీకి తగిలి ఈ ప్రమాదం చోటుచేసుకుందని తెలిపారు. ప్రమాదం జరిగిన సెకన్ల వ్యవధిలోనే డీటీఆర్ ట్రాన్స్‌ఫార్మర్ దగ్గర ఉన్న ఫ్యూజు కరిగిపోయిందని, ట్రాన్స్‌ఫార్మర్ కూడా ట్రిప్ కావడంతో కరెంట్ షాక్ తగిలిందని తెలిపారు. దీంతో వారికి గాయాలయ్యాయని తెలిపారు.

నిమజ్జనోత్సవంలో స్వల్ప ఉద్రిక్తత

- ప్రశాంతంగా ముగిసిన శోభాయాత్ర

భైంసాటౌన్: భైంసా పట్టణంలో మంగళవారం వినాయక నిమజ్జనోత్సవంలో స్వల్ప ఉద్రిక్తత చోటుచేసుకుంది. అర్ధరాత్రి దాటిన తరువాత పిప్రికాలనీలో గణనాథులను తరలించాలనే క్రమంలో పోలీసులు, యువకుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. పోలీసులు లాఠీచార్జి చేయడంతో ఇద్దరు యువకులు గాయాలపాలయ్యారని ఆరోపిస్తూ కిసాన్‌గల్లీలో పలువురు శోభాయాత్రను నిలిపేసి ధర్నా చేపట్టారు. బాధ్యులైన పోలీసులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీంతో అక్కడికి చేరుకున్న ఎస్పీ ప్రవీణ్‌కుమార్, ఏఎస్పీ కాంతిలాల్‌పాటిల్ లాఠీచార్జి విషయం తన దృష్టికి రాలేదని, విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని చెప్పడంతో వారు ధర్నా విరమించారు. అనంతరం నిమజ్జన శోభాయాత్ర యథావిధిగా కొనసాగింది.

అవాస్తవాలు ప్రచారం చేయవద్దు..

నిమజ్జనోత్సవంలో యువకులపై పోలీసులు లాఠీచార్జి చేశారన్న మాట అవాస్తవమని ఏఎస్పీ కాంతిలాల్‌పాటిల్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజల్లో భయాందోళన కలిగించేలా అవాస్తవాలు ప్రచారం చేయవద్దన్నారు. పిప్రికాలనీలో యువకులు గాయపడిన ఘటనపై విచారణ చేస్తామన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో తప్పిన ప్రమాదం


లీకైన గ్యాస్ సిలిండర్

ఆదిలాబాద్‌రూరల్: గ్యాస్ లీకేజీతో మంటలు చెలరేగగా పెను ప్రమాదం తప్పింది. ఈ ఘటన ఆదిలాబాద్ రూరల్ మండలంలో చోటుచేసుకుంది. మండలంలోని రామాయి గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో బుధవారం మధ్యాహ్న భోజనం నిమిత్తం వంట చేస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు గ్యాస్ లికేజీతో ఒక్కసారిగా మంటలు అంటుకున్నాయి. గమనించిన స్థానికులు, పాఠశాల సిబ్బంది వెంటనే మంటలు ఆర్పేశారు. దీంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ ఘటనలో వంట మనిషి వనిత చేతు కాలడంతో ఆమెను చికిత్స కోసం 108 అంబులెన్స్‌లో రిమ్స్ ఆసుపత్రికి తరలించారు.

జ్వరంతో బాలుడి మృతి

- హర్కపూర్‌తండాలో విషాదం


రాథోడ్ దిలీప్ (ఫైల్)

ఇంద్రవెల్లి: జ్వరంతో బాలుడు మృతిచెందిన సంఘటన బుధవారం మండలంలోని హర్కపూర్‌తండాలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం... రాథోడ్ దన్‌రాజ్, సంగీత దంపతులకు దీపక్, దిలీప్(15) ఇద్దరు కుమారులున్నారు. దిలీప్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. అయితే 15రోజులుగా జ్వరంతో బాధపడుతున్నాడు. కుటుంబ సభ్యులు మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి, పలు ప్రైవేటు ఆస్పత్రులకు తీసుకెళ్లి వైద్యం అందించినా నయం కాలేదు. దీంతో ఈ నెల 17న ఆదిలాబాద్‌లోని రిమ్స్‌కు తరలించారు. పరీక్షించిన వైద్యులు పచ్చకామెర్లు, టాయిఫాడ్ ఉన్నట్లు నిర్ధారించి చికిత్స నిర్వహించారు. రోజురోజుకూ బాలుడి ఆరోగ్య పరిస్థితి విషమించడంతో రిమ్స్ వైద్యులు మూడు రోజుల క్రితం హైదరాబాద్‌లోని ఉస్మానియ ఆస్పత్రికి రెఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ పరి స్థితి విషమించి బుధవారం మృతి చెందాడు. బాలు డి మృతితో హర్కపూర్‌తండాలో విషాదం అలుముకుంది.

పారిశుధ్య కార్మికుడు మృతి


వడ్లూరి లక్ష్మణ్ (ఫైల్)

నర్సాపూర్(జి): మండలంలోని చాక్‌పల్లి గ్రామంలో పారిశుధ్య కార్మికుడు మృతి చెందిన సంఘటన మంగళవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. గ్రామస్తుల వివరాల ప్రకారం... మండలంలోని చాక్‌పల్లి గ్రామానికి చెందిన వడ్లూరి లక్ష్మణ్(40) గ్రామ పంచాయతీలో పారిశుధ్య కార్మికుడిగా కొన్నేళ్లుగా పనిచేస్తున్నాడు. మంగళవారం అర్ధరాత్రి గణేష్ శోభాయాత్రలో డ్యాన్స్ చేస్తున్న క్రమంలో ఫిట్స్‌తో పాటు చాతీలో నొప్పి రావడంతో ఒక్కసారిగా కుప్పకూలాడు. గమనించిన గ్రామస్తులు కారులో నిర్మల్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు తెలిపారు. అతడికి భార్య, కొడుకు, కూతురు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో హోంగార్డు మృతి


కిరణ్ మృతదేహం

నిర్మల్‌రూరల్: జిల్లా కేంద్రంలోని మంజులాపూర్ వద్ద బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో నిర్మల్‌రూరల్ పోలీస్‌స్టేషన్‌లో హోంగార్డుగా పనిచేస్తున్న మాసం కిరణ్(35) మృతి చెందాడు. రూరల్ ఎస్సై చంద్రమోహన్ కథనం ప్రకారం... కిరణ్ వినాయక నిమజ్జనం సందర్భంగా బైక్‌పై పెట్రోలింగ్‌కు వెళ్తుండగా మంజులాపూర్ వద్ద భైంసా వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు వెనుక నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో కిరణ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108 వాహనంలో ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతిచెందినట్లు తెలిపారు. కిరణ్ స్వగ్రామం బోథ్ మండలం సాకేర గ్రామం కాగా అతడికి భార్య, 10ఏళ్ల లోపు కూతురు, కుమారుడు ఉన్నారు. కేసు నమోదు చేసుకొని చేసుకున్న దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపాడు.

గోదావరినదిలో చిక్కుకున్న గేదెల కాపరులు


గేదెల కాపరులను కాపాడిన ఎస్సై, పోలీసులు

సోన్: మండల కేంద్రానికి చెందిన గేదెల కాపరులు గోదావరిలో చిక్కుకోవడంతో బుధవారం ఎస్సై తన సిబ్బందితో వెళ్లి కాపాడారు. వివరాల ప్రకారం ... సోన్ మండలానికి చెంది గేదెల కాపారులు రోజులాగే గోదావరి మధ్యలో కుర్రు ప్రాంతానికి గేదెలను తీసుకుని వెళ్లారు. అర్క రవి, పల్లికొండా పోశెట్టి శ్రీరాంసాగర్ ప్రాజెక్టు గేట్లు ఎత్తడంతో గోదావరి ప్రవాహం ఎక్కువై కావడంతో వారితో పాటు 80 గేదెలు చిక్కుకున్నాయి. సమాచారం తెలుసుకున్న ఎస్సై సంతోషం రవీందర్ తన సిబ్బందితో వెళ్లి ప్రాజెక్టు అధికారులతో మాట్లాడి నాలుగు గేట్లను మూసివేయించారు. వరద ఉధృతి తగ్గడంతో మహేందర్ అనే మత్స్యకారుడి సాయంతో బయటకు తీసుకొచ్చారు. వీరిని కాపాడిన ఎస్సై రవీందర్, పోలీసులు ప్రతాప్‌రెడ్డి, శేఖర్, శివకుమార్‌లను సీఐ నవీన్‌కుమార్ అభినందించారు.

ఓటరు జాబితా రూపొందించాలి

- పరిశీలకులు అహ్మద్ నదీమ్


మాట్లాడుతున్న అహ్మద్ నదీమ్, పాల్గొన్న కలెక్టర్

మంచిర్యాలఅగ్రికల్చర్: ఓటరు నమోదు, జాబితాలో మార్పులు, సవరణలు, తొలగింపుల కోసం అందిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి స్పష్టమైన ఓటరు జాబితా రూపొందించాలని కార్మిక శాఖ కమిషనర్, ఓటరు జాబితా పరిశీలకులు అహ్మద్ నదీమ్ అన్నారు. బుధవారం నస్పూర్‌లోని సమీకృత కలెక్టరేట్‌లో కలెక్టర్, ఎన్నికల అధికారి బదావత్ సంతోష్, జిల్లా అదనపు కలెక్టర్లు రాహుల్, మోతీలాల్‌లతో కలిసి జూలై 15 నుంచి సెప్టెంబర్ 20 వరకు అందిన దరఖాస్తులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దరఖాస్తులను ఎన్నికల సంఘం నిబంధనలకు లోబడి పరిష్కరించాలని సూచించారు. అక్టోబర్ 4న తుది జాబితా ప్రచురించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కుమురంభీం జిల్లా రెవెన్యూ అధికారి జాడి రాజేశ్వర్, మంచిర్యాల ఆర్డీవో రాములు, చెన్నూర్ రిటర్నింగ్ అధికారి దత్తు, ఎన్నికల తహసీల్దార్లు దేశ్‌పాండే శ్రీనివాస్, మంచిర్యాల, నిర్మల్, ఆదిలాబాద్, కుమురంభీం జిల్లాల తహసీల్దార్లు పాల్గొన్నారు.

భైరందేవ్ విగ్రహం కనిపించింది..!


కనిపిస్తున్న భైరందేవ్ విగ్రహం

బేల: శాతవాహనుల కాలంలో మండలంలోని సదల్‌పూర్ రెవెన్యూ గ్రామ శివారులోని ఆదివాసీల ఆరాధ్యదైవమైన భైరందేవ్, మహాదేవ్ ఆలయాలు నల్లరాతితో నిర్మించబడ్డాయి. ఏళ్ల నుంచి ఈ కాలం వరకు భైరందేవ్ ఆలయంలో పూ జల్లో భాగంగా వేసే చంద్రంతో విగ్రహం మూ సుకుపోయింది. ఈ భైరందేవ్ విగ్రహం పూర్వీ కులు సైతం ఎవరు చూడలేదు. రోజువారీలా ఆలయంలో బుధవారం రాత్రి పూజారులు భైరందేవ్ ఆలయంలో పూజలు చేసి బయటకు వస్తుండగా విగ్రహం పైభాగపు చంద్రం తొలగిపోయింది. ఈ క్రమంలో అద్భుతమైన భైరందేవ్ విగ్రహ రూపం కనిపించింది. ఈ విషయం ఒకరి నుంచి మరొకరికి తెలియడంతో మండలవాసులు ఆలయానికి చేరుకుని పూజలు చేస్తున్నారు. రాత్రంతా భజనలతో జగారం చేయనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు కొరంగే శ్యాంరావు, ప్రధాన కార్యదర్శి సిడాం కుషాల్‌రావులు తెలిపారు.

కిడ్నాప్ కేసులో మూడేళ్ల జైలు

కాసిపేట: మైనర్‌ను కిడ్నాప్ చేసిన కేసులో గోదావరిఖని విఠల్‌నగర్‌కు చెందిన పెగడపల్లి వెంకటేష్‌కు మూడేళ్ల సాధారణ జైలుశిక్ష, రెండువేల రూపాయల జరిమానా బుధవారం మంచిర్యాల సీనియర్ సివిల్ జడ్జి, అసిస్టెంట్ సేషన్స్ జడ్జి ఆర్పిత మారం రెడ్డి విధించినట్లు ఎస్సై గంగారాం తెలిపారు. 2016 అక్టోబర్ 30న నమోదైన కేసు ప్రకారం హైదరాబాద్ గాజుల రామారంకు చెందిన జెమాల్‌పూర్ అమర్‌నాథ్ కూతురు కల్వరి చర్చికి వచ్చింది. అక్కడి నుంచి కనిపించకుండ పోయినట్లు ఫిర్యాదు చేశారు. విచారణ అనంతరం పైవిధంగా తీర్పు వచ్చింది

యువకుడు ఆత్మహత్య

కుభీర్: మద్యం మత్తులో యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. ఎస్సై ఎండీ.షరీఫ్ వివరాల ప్రకారం.. మండలంలోని దొడర్నా2కు చెందిన జాదవ్ కృష్ణ (31) మద్యానికి బానిసయ్యాడు. మద్యం మత్తులో జీవితంపై విరక్తి చెంది పురుగుల మందుతాగి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చాడు. వారు వచ్చేసరికి మృతిచెందాడు. భార్య జాదవ్ శ్రీదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి ఇద్దరు కూతుర్లు, కుమారుడు ఉన్నారు.



'మంచు'సిత్రం

అడవుల జిల్లాగా పేరొందిన ఆదిలాబాద్ జిల్లాలో ప్రకృతి అందాలకు కొదువలేదు. సాధారణంగా చలికాలంలో ఇక్కడ ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పట్టి ఆకాశంలోని మేఘాలు అవనిని చేరుకున్నట్లు పొగమంచు కమ్ముకుంటుంది. వర్షాకాలం పూర్తి కాకముందే జిల్లాలోని గ్రామీణ, అటవీ ప్రాంతంలో ఉష్ణోగ్రతలు తగ్గి జాతీయ రహదారి దట్టమైన పొగమంచుతో శీతాకాలపు అందాలతో మైమరిపిస్తోంది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్